@netifocusnews @focustv
http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్


అను నిత్యం...ప్రజా పక్షం...

ఎడిటర్: యం.తరుణ్

తెలుగు డిజిటల్ దినపత్రిక

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | హైదరాబాద్ | శుక్రవారం 19, జూలై 2024 | పేజీలు: 04

## రూ.లక్ష రుణమాఫీ అందోల్ ఫస్ట్..



రెండు, మూడు స్థానాల్లో హుస్నాబాద్, కల్వకుర్తి

2



# రుణమాఫీ! షురూ





- తొలి విడత రూ.లక్ష లోపు రుణాలు మాఫీ
- రైతుల ఖాతాల్లో రూ.6,098కోట్లు జమ
- 11.5లక్షల మంది అన్నదాతలకు లబ్ధి
- గ్రామాల్లో రైతన్నల సంబరాలు

## సచివాలయంలో అట్టహాసంగా ప్రారంభించిన సీఎం

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 18:

రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ సచివాలయంలో ప్రారంభించారు. మొదటి విడతలో భాగంగా రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేయడం కోసం ఏకంగా రూ.6,098 కోట్లను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీని ద్వారా 11.5 లక్షల మంది రైతులకు లబ్ధి కలగనుంది. రెండో విడతలో భాగంగా రూ.లక్షన్నర రుణమాఫీని ఈ నెలాఖరు లోపు చేయనున్నారు. మిగతా 2లో..



## దేశానికే ఆదర్శం తెలంగాణ

- రుణమాఫీతో 16ఏళ్ల రాజకీయ జీవితంలో మరుపురాని రోజు
- రుణమాఫీకి పాసుబుక్కే కొలబద్ద
- పదేళ్ల అధికారంలో రూ.21వేల కోట్లు మాఫీ చేయలేదు
- సోనియా, రాహుల్ ఇచ్చిన హామీని నెరవేర్చాం..
- నెలాఖరున వరంగల్‌లో రాహుల్ గాంధీకి కృతజ్ఞత సభ
- వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో రేవంత్ రెడ్డి మాటామంతీ



వివరాలు 02లో..


## రుణమాఫీ నిధులు ఇతర అప్పులకు వాడొద్దు

- నిర్దేశించిన లక్ష్యం మేరకే ఉపయోగించాలి
- బ్యాంకర్లకు డిప్యూటి సిఎం భట్టి సూచన
- రుణమాఫీపై బ్యాంకర్లతో సమీక్ష..

2

## ఫలితాలను వెబ్‌సైట్‌లో పెట్టండి

- పరీక్షా కేంద్రం, నగరాల వారిగా వివరాలు ఇవ్వండి
- ఎన్‌ఎటిని ఆదేశించిన సుప్రీం కోర్టు



వివరాలు 02లో..

## సీఎంతో మిథాలి మధుస్మిత భేటీ

### - ఇషా సింగ్‌కు సిఎం రేవంత్ అభినందనలు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 18:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదాయ పన్ను శాఖ ప్రిన్స్‌పల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత కలిసారు. ఈ సందర్భంగా వారి మధ్య జివిస్టీ వసూళ్లు తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. అలాగే రాష్ట్రం ఆర్థిక పరిస్థితుల పైనా చర్చించారని సమాచారం. ఇకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇండియన్ అమెచ్యూర్ షూటర్ ఇషా సింగ్ కలిశారు. ప్యారిస్ లో జరగబోయే ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ ఫిస్టల్ విభాగంలో భారత దేశం తరఫున ఇషా సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సందర్భంగా మావెను సిఎం అభినందించారు.



## హరీష్ రావు.. నీ రాజీనామా ఎక్కడ?

- రైతు రుణమాఫీ సవాల్ ఏమయ్యింది?
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశ్న


జగిత్యాల, (నేటి ఫోకస్‌న్యూస్), జూలై 18:

హరీష్‌రావు.. నీ రాజీనామా పత్రం ఎక్కడ? అంటూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశ్నిం చారు. రైతు రుణమాఫీపై కేటీఆర్, మిగతా 2లో..

## చిన్నారులపై కుక్కల దాడి ఘటన.. హైకోర్టు ఆగ్రహం

- నియంత్రించాలని ఆదేశం
- షెల్టర్ హోమ్‌లకు తరలించే ఆలోచన చేయాలని సూచన

2



## పెద్దవాగు ప్రాజెక్టుకు భారీ గండి

### వరదలో చిక్కుకున్న 20మంది కూలీలు

భద్రాద్రి కొత్తగూడెం, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 18:

రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం పరిధిలోని పెద్దవాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. అధికారులు గేట్లు ఎత్తివేయడంతో ప్రాజెక్టు దిగువ భాగంలో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగి పోయింది. దీంతో భద్రాద్రి కొత్తగూడెంలోని నారాయణపురం వద్ద 20 మంది కూలీలు వరదలో చిక్కుకున్నారు. సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. బాధితులను రక్షించేందుకు సీఎం వోతో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మిగతా 2లో..

## రైతుబంధు నిధుల దారి మళ్లింపు

- 7వేల కోట్లు రుణమాఫీకి మళ్లించారన్న కెటీఆర్

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 18:

రుణమాఫీ పేరిట రేవంత్ సర్కార్ మరోసారి తెలంగాణ రైతులను మోసం చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఎక్స్(ట్విటర్) వేదికగా పోస్టు చేశారు. రైతుబంధు కింద జూన్ నెలలో ఇవ్వాల్సిన నిధుల నుంచే రూ.7000 మిగతా 2లో..





## పట్టాలు తప్పిన ఎక్స్‌ప్రెస్ రైలు

- నలుగురు మృతి, 20మందికి పైగా గాయాలు
- యూపిలో ఘటన

లక్నో, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 18:

మరోరైలు పట్టాలు తప్పింది. ఉత్తర ప్రదేశ్ లోని గోండా జిల్లాలో చండీగఢ్- డిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. గురువారం మధ్యాహ్నం 2.35గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మిగతా 2లో..

## చిన్నారులపై కుక్కల దాడి ఘటన..
# హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 18:

చిన్నారులపై వీధి కుక్కల దాడిపై హైకోర్టు మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చిన్నారులపై కుక్కల దాడిని ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. వీధి కుక్కల బారి నుంచి పిల్లలను రక్షించేందుకు పరిష్కార మార్గాలను అన్వేషించాలని కోర్టు ఆదేశించింది. వచ్చే వాయిదాకు పరిష్కార మార్గాలతో రావాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.జీహెచ్ఎంసీ పరిధిలో 3లక్షల 80 వేల వీధికుక్కలు ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. వాటిని సంరక్షణ కేంద్రాలకు తరలించడం సాధ్యం కాదని తెలిపింది. రహదారులపై వ్యర్థాల వల్లే కుక్కల స్వైరవిహారం ఎక్కువైందని కోర్టు పేర్కొంది. వ్యర్థాలను నిర్మూలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి కోర్టు వాయిదా వేసింది. కుక్కల దాడిలో చిన్నారి మృతి చెందిన ఘటనపై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. జవహర్‌నగర్‌లో కుక్కల దాడిలో సంవత్సరం న్నర బాలుడు మృతిచెందిన విషయం తెలిసిందే. దీనిపై ఈరోజు హైకోర్టులో విచారణకు రాగా... వీధి కుక్కల దాడి ఘటనలను నివారించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 3.79 లక్షల వీధి కుక్కలు ఉన్నాయని అడ్వకేట్ జనరల్ తెలిపారు. కుక్కల దాడి ఘటనలు నివారించేందుకు స్టేట్ లెవెల్ కమిటీలు ఏర్పాటు చేశామని ప్రభుత్వం వెల్లడించారు. హైదరాబాదులో ఆరు కేంద్రాల వద్ద కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తున్నామని హైకోర్టుకు ప్రభుత్వం తెలియ జేసింది. ఒక్కో కేంద్రం వద్ద సుమారు రోజుకు 200 కుక్కలకు స్టెరిలైజేషన్ ఉంటుందన్నారు. అయితే స్టెరిలైజేషన్ ద్వారా దాడి ఘటనలను ఎలా ఆపుతారని హైకోర్టు మరో ప్రశ్న వేసింది. షెల్టర్ హోమ్స్‌కు తరలిస్తే సమస్య పరిష్కారం అవుతుందని ఎనిమల్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. నాగపూర్‌లో దాదాపు 90 వేల కుక్కలను షెల్టర్ హోమ్‌లో పెట్టినట్టు హైకోర్టుకు అనిమల్ వెల్ఫేర్ తరపున న్యాయవాది చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలతో అనిమల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భేటీ అయ్యి పరిష్కారం చూపాలని ధర్మాసనం తెలిపింది. అలాగే తదుపరి విచారణను రెండు వారాలకు హైకోర్టు వాయిదా వేసింది. మరోవైపు కుక్కల దాడిలో బాలుడి మృతిపై సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను కలిచివేసిందని అన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పలుమార్లు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నందున వీధి కుక్కల బెడదను అరికట్టడానికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. వీధి కుక్కల బెడద ఉన్న ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించడానికి కాల్ సెంటర్ లేదా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని అర్బన్ హెల్త్ సెంటర్లు, రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో కుక్కలు దాడులు చేస్తే తక్షణం అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్యా రోగ్య శాఖను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## పెద్దవాగు ప్రాజెక్టుకు
# భారీ గండి

(మొదటి పేజీ తరువాయి..)

సంప్రదింపులు జరిపారు. హెలికాప్టర్ ద్వారా బాధితుల్ని రక్షించాలని ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం, రెస్క్యూ టీమ్ సహాయ చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల సూచించారు. గురువారం తెల్లవారుజాము నుంచి భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఎడతెరపిలేకుండా వానకురుస్తున్నది. దీంతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం 21 అడుగులకు చేరింది. చర్ల వద్ద రహదారి పైకి నీరు చేరడంతో రాకపోలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరా స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారిపై పైకి మూడు అడుగుల మేర వర్షం నీరు చేరడటంతో భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల, వాజేడు, వెంకటాపురం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాష్ట్రంలో మరో మూడు రోజులు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ఫలితాలను వెబ్‌సైట్‌లో పెట్టండి

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 18:

నీట్–యూజీ పేపర్ లీకేజీ, పరీక్ష నిర్వహణలో అవకతవకలపై విచారణ జరుపుతోన్న భారత సర్వోన్నత న్యాయస్థానం.. సుప్రీం కోర్టు.. పరీక్ష కేంద్రం, నగరాల వారీగా వాటి ఫలితాలు ప్రకటించాలని ఎన్‌టీఏను ఆదేశించింది. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు వాటిని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని పేర్కొంది. 'నీట్– యూజీ' సంబంధిత పిటిషన్‌లను జులై 22న తిరిగి విచారిస్తామని సుప్రీం కోర్టు పేర్కొంది. పరీక్ష కేంద్రాల వారీగా ఫలితాలను వెల్లడించేటప్పుడు విద్యార్థుల వివరాలను కనిపించకుండా చూడాలని సూచించింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్–యూజీ పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. విస్తృత స్థాయిలో పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదని గుర్తిస్తేనే రీటెస్ట్‌కు ఆదేశించగలమని సందర్భంగా స్పష్టం చేసింది. ఈ సందర్భంగా తీవ్ర వాదనలు కొనసాగాయి. ప్రాథమిక ఆధారాల ప్రకారం, ప్రశ్నపత్రం లీకేజీ కేవల పట్నా, హజారీబాగ్‌లకే పరిమితమైనట్లు కనిపిస్తోందని కోర్టు పేర్కొంది. అయితే, గుజరాత్‌లో అలాంటిదేమీ జరగలేదని చెప్పలేమని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో పేపర్ లీక్ కొన్ని కేంద్రాలకే పరిమితమైందా? లేదా ఇతర కేంద్రాలు, దేశవ్యాప్తంగా వ్యాపించిందా? అనే విషయాలు తెలిసేందుకు ఫలితాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంచడం కీలకమని వ్యాఖ్యానించింది. అయితే, విద్యార్థుల గోప్యత దృష్ట్యా వారి వివరాలు కనిపించడకుండా ఉంచాలని తెలిపింది.

## పట్టాలు తప్పిన ఎక్స్‌ప్రెస్ రైలు

(మొదటి పేజీ తరువాయి..)

ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణి కులు మృతిచెందగా.. దాదాపు 20 మందికి పైగా గాయపడినట్లు యూపీ ఉపముఖ్య మంత్రి బ్రజేశ్ పాథక్ తెలిపారు. ఈ రైలు బుధవారం రాత్రి చండీగఢ్ స్టేషన్ నుంచి అస్సాంలోని డిబ్రూగఢ్‌కు బయల్దేరింది. గురువారం మధ్యాహ్నం యూపీలోని ఝులాహి రైల్వే స్టేషన్‌కు కొన్ని కిలోమీటర్ల దూరంలో ప్రమాదానికి గురైంది. నాలుగు ఏసీ బోగీలు సహా 12 బోగీలు పట్టాలు తప్పాయి. ఒక పక్కకు ఒరిగిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారమందుకున్న స్థానిక పోలీసులు, అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. 15 అంబులెన్స్‌లు, మెడికల్ బృందాన్ని సిద్ధంగా ఉంచారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం గురించి తెలియగానే యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంబంధిత యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అటు అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ కూడా దీనిపై స్పందించారు.

# రుణమాఫీ షురూ

(మొదటి పేజీ తరువాయి..)



ఇక ఆగస్టు నెల దాటక ముందే రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయనున్నారు. రైతుల రుణమాఫీ కోసం మొత్తంగా రూ.31 వేల కోట్లను ఖర్చు చేయనున్నారు. సచివాలయంలో గురువారం రుణమాఫీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పథకం ద్వారా లబ్ది పొందిన వివిధ జిల్లాల రైతులతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖిగా వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పలుచోట్ల జిల్లాల్లో రైతు వేదికల్లో ఉన్న రైతులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడేలా ఏర్పాట్లు చేశారు. రైతులకు రుణమాఫీపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తమకు ఆనందంగా ఉందని, పలువురు రైతులు నేరుగా సిఎంకు వివరించారు. పదేళ్లగా ఎదురుచూస్తున్నామని, ఇలా చేస్తారని ఊహించలేదన్నారు. రుణమాఫీపై సోనియా, రాహుల్ మాటకు కట్టుబడి నిర్ణయం తీసుకున్నా మన్నారు. వరంగల్ డిక్లరేషన్ మేరకు అమలు చేస్తున్నామని అన్నారు. ఈ క్రమంలో వరంగల్‌లో ఎక్కడైతే రాహుల్ హామీ ఇచ్చారో అక్కడే కృతజ్ఞత సబను ఏర్పాటు చేసి, రాహుల్‌ను ఆహ్వానిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, సిఎస్ శాంతికుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాట ఇస్తే శిలాశాసనమని మరోసారి రుజువైందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రుణమాఫీ అమలు చేస్తున్నామన్నారు. తొలివిడతగా రూ.1 లక్ష లోపు రైతు రుణాల మాఫీని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 110 రైతు వేదికల్లోని రైతులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయం నుంచి ఆయన మాట్లాడారు. మొత్తం 11.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,098 కోట్ల నగదు జమ చేసినట్లు తెలిపారు. ఆర్థికశాఖ ఇప్పటికే బ్యాంకులకు నగదు జమ చేసింది. గతంలో రుణమాఫీ అమలు చేస్తామని ఐదేళ్ల కాలయాపన చేశారు. గత ప్రభుత్వం రుణమాఫీ పథకం సరిగా అమలు చేయలేదు. రైతు డిక్లరేషన్‌లో భాగంగా రైతులకు రుణమాఫీ చేస్తున్నాం. ఇంతకుముందు చెప్పినట్లుగానే ఈ నెలాఖరు నాటికి రూ.లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలను మాఫీ చేస్తాం. పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ ఉంటుంది. కుటుంబాన్ని నిర్ధారించేందుకే రేషన్ కార్డు ప్రామాణికం. రుణాలు తీసుకున్న దాదాపు 6.36 లక్షల మందికి రేషన్ కార్డులు లేవు. అందుకే పాస్‌బుక్ ఆధారంగా రుణమాఫీ చేస్తు న్నాం అని వివరించారు. గత ప్రభుత్వం రూ.7ల క్షల కోట్లు అప్పులు చేసింది. దీనికి ప్రతి నెలా రూ.7వేల కోట్లు వడ్డీ చెల్లిస్తున్నాం. జీతాలు, పింఛన్ల కోసం రూ.5వేల కోట్లు కేటాయిస్తున్నాం. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే వివిధ పథకాల కోసం రూ.29 వేల కోట్లు ఖర్చు చేశాం. ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని నిరూపించాం. మొత్తం మూడు విడతల్లో రూ.31 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు దశల్లో రుణాల మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రెండో విడత రుణమాఫీకి రూ.8వేల కోట్లు అవసరమని అంచనా. రూ.లక్షన్నర నుంచి రూ.2లక్షల వరకు ఉన్న రైతు రుణాలను ఆగస్టు 15లోపు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడో విడత రుణమాఫీకి రూ.15వేల కోట్లు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఇది చారిత్రాత్మక రోజని, ఇది రైతులకు పండుగరోజని అన్నారు. ఇబ్బందులు ఎదురైనా, జనాలు అపహాస్యం చేసినా రైతుల రుణమాఫీ చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేస్తోందని.. బృహత్తర కార్యక్రమాన్ని కాంగ్రెస్ చేసి చూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సలహాదారు కె. కేశవరావు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేం దర్ రెడ్డి, ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుండడంతో గాంధీ భవన్‌లో భారీగా సంబరాలు జరిగాయి. ప్రభుత్వం రూ.2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేస్తున్న సందర్భంగా బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, అధికార ప్రతినిధులు సత్యం శ్రీరంగం, కమల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సంబరాలు జరుపుకున్నారు. సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తొలిదశలో రైతులకు లక్ష వరకు రుణమాఫీ చేస్తుండటంతో ఘనంగా సంబరాలు చేసుకుంటున్నారు. బ్యాంకుల్లో రుణమాఫీ నగదు జమ చేయడంతో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు లబ్దిదారులతో కలిసి సంబరాలు చేసుకున్నారు.

### దేశానికే ఆదర్శం తెలంగాణ..

ఇప్పటి వరకు ఆ మోడల్, ఈ మోడల్ అని పలువురు చెప్పుకున్నారు. రూ.2లక్షల రైతు రుణమాఫీతో ఇక నుంచి తెలంగాణ ప్రభుత్వం దేశానికి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా, నమూనాగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జడ్పీటీసీ సభ్యునిగా, శాసనమండలి సభ్యునిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా పార్లమెంట్‌లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పని చేశానని తెలిపారు. తన 16ఏళ్ల రాజకీయ జీవితంలో ఈరోజు మరుపురాని రోజని ముఖ్యమంత్రి భావోద్వేగానికి గురయ్యారు. రూ.2లక్షల రుణమాఫీకి సంబంధించిన కార్యక్రమాన్ని రాష్ట్ర సచివాలయంలో గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 577 రైతు వేదికల్లోని అన్నదాతలు, రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఆయా రైతు వేదికల వద్దనున్న రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి స్వయంగా మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ 2002, మే 6వ తేదీన వరంగల్లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని, నాడే రూ.2 లక్షల రుణమాఫీకి హామీ ఇచ్చామని గుర్తు చేశారు. 2023, సెప్టెంబరు 17వ తేదీన కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ ఆరు గ్యారంటీలతో పాటు రైతు రుణమాఫీ హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ అగ్ర నేతల హామీ ప్రకారం.. మంత్రివర్గ సహచరులు, అధికారుల సహకారంతో రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. కాంగ్రెస్ మాట ఇస్తే శిలా శాసనమని రుణమాఫీతో మరోసారి నిరూపణ అయిందని ముఖ్యమంత్రి అన్నారు.అరవై సంవత్సరాల ప్రజల ఆకాంక్షను గుర్తించి 2004లో కరీంనగర్ సభలో సోనియా గాంధీ తెలంగాణ ఏర్పాటుకు హామీ ఇచ్చారని, ఎక్కువ ఎంపీ సీట్లున్న ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా తీవ్రంగా నష్టపోతామని తెలిసినా ఇచ్చిన మాట మేరకు తెలంగాణ ఇచ్చారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.మాట తప్పని,మడమ తిప్పని నాయకురాలిగా,తెలంగాణ ప్రజలు శాశ్వతంగా గుర్తుపెట్టు కునేలా సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారని ముఖ్యమంత్రి కొనియాడారు. రైతుల అనుమతితో తాను, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీ వెళ్లి సోనియా గాంధీకి, రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలుపుతామని అన్నారు. ఏ వరంగల్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో రుణమాఫీ హామీ ఇచ్చామో అక్కడే కృతజ్ఞత సభ పెడతామని, ఆ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానించి రాష్ట్ర రైతుల తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.మిగులు రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ రుణమాఫీ విషయంలో రెండు సార్లు మాట తప్పారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. రూ.లక్ష రుణమాఫీతో తొలిసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ రూ.16 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని, అయిదేళ్లలో దఫాదఫాలుగా కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని మండిపడ్డారు. రూ.లక్ష రుణమాఫీతో రెండోసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ రూ.12 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి దఫాదఫాలుగా కేవలం రూ.9 వేల కోట్లు మాత్రమే చేశారని, మొత్తంగా పదేళ్లలో రూ.21 వేల కోట్లకు మించి రుణమాఫీ చేయలేదని ఆగ్ర హం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఒకే సారి రుణమాఫీ చేయకపోవడం తో వడ్డీలు మిగిలి పోయి రైతుల అప్పులు తీరలేదన్నారు. రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉన్నా కేసీఆర్ ప్రజలకిచ్చిన మాటను నెరవేర్చలేదని విమర్శించా రు. తాము ఒకేదఫా రూ.2 లక్షల మేర రుణాలను మాఫీ చేస్తున్నామన్నారు. తొలి విడతగా 0 నుంచి రూ.1 లక్ష వరకు ఉన్న రుణాలకు రూ.6,098 కోట్లను విడుదల చేశామని ముఖ్యమంత్రి వెల్లడిం చారు. రెండో విడతగా 0 నుంచి రూ.1.50 లక్షల వరకు ఉన్న రైతులకు, మూడో విడతగా 0 నుంచి రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆగస్టు నెల పూర్తికాకముందే రూ.31 వేల కోట్లను రైతు రుణ ఖాతాల్లో వేసి రుణ విముక్తులను చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం డిసెంబరు ఏడో తేదీనే ప్రమాణ స్వీకారంచేసినా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించిన డిసెంబరు 9వ తేదీని పరిగణనలోకి తీసుకొని రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. డిసెంబరు 9న మరో పండుగ ఉందని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ పుట్టిన రోజు డిసెంబరు 9వ తేదీనేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అందుకే 2018 డిసెంబరు 12 నుంచి 2023, డిసెంబరు 9 వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రుణమాఫీకి రేషన్ కార్డు ఉండాలనే అపోహను కొందరు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రేషన్ కార్డు అనేది కేవలం కుటుంబాన్ని గుర్తించడానికి మాత్రమేనన్నారు. రుణమాఫీకి రేషన్ కార్డు ప్రాతిపదిక కాదని, రుణమాఫీకి పాస్ బుక్‌నే కొలబద్ద అని ముఖ్యమంత్రి తెలిపారు.భూమి ఉండి, ఆ భూమికి పాసు బుక్ ఉండి, పాసు బుక్‌పై రుణం తీసుకుంటే దానిని మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి వివరించారు. ఈ విషయంలో కొందరు దొంగలు చేసే దొంగ మాటలను నమ్మొద్దని, దీనిపై అవగాహన కల్పించాలని ఆయన అధికారులు, రైతు వేదికల్లోని రైతులను కోరారు. రైతు రుణమాఫీ హామీ ఇచ్చి నిలుపుకున్నం దున సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లి కార్జున ఖర్గేలకు ధన్యవాదాలు తెలుపుదామా అని ముఖ్యమంత్రి రైతు వేదికల్లో ఉన్న రైతులను అడిగారు. అందుకు సమ్మతిస్తూ అంతా చప్పట్లతో ఆమోదం తెలపడంతో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలకు కృతజ్ఞత తీర్మానాన్ని ఆమోదించారు. త్వరలోనే మంత్రివర్గ సహచరుల తో కలిసి ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీని వరంగల్ కృతజ్ఞత సభకు ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. రూ.లక్ష రుణమాఫీ అయిన పది మంది రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలానికి చెందిన మలిపెద్ది చెన్నమ్మ (తొమ్మిదిరేకుల (గ్రామం), జర్పుల శంకర్ (చౌలపల్లి), కందుకూరు మండలానికి చెందిన చింతకింది భిక్షపతి (లేమూరు), బండి జగదాంబ (గూడూరు), ఎర్రా అండాలు (ముచ్చెర్ల), క్యాతరమోని మల్లయ్య (పెద్ద ఎల్కచర్ల–జిల్లేడ్ చౌదరిగూడ మండలం), గొడుగు చెన్నయ్య (అగిర్యాల–కొందుర్గ్ మండలం), మారమోని యాదమ్మ (తుమ్మలూరు–మహేశ్వరం మండలం), అరకోటం శారద (ముక్తమదారం–కడ్తాల్ మండలం), విట్యాల అండాలు (కృష్ణ నగర్–ఫరూఖ్ నగర్ మండలం), మల్లిగారి మాణిక్య రెడ్డి (గోపులారం–శంకర్‌పల్లి మండలం) రుణమాఫీ చెక్కులు అందుకున్నారు. రుణమాఫీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు వేదికల వద్ద ఉన్న రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఖమ్మం జిల్లా వి.వెంకటా యపాలెం నుంచి కుతుంబాక సీతారాం, నాగర్ కర్నూల్ జిల్లా రామాపురం నుంచి రాములమ్మ, నల్గొండ జిల్లా నుంచి తిప్పర్తి రాజు, సంగారెడ్డి నుంచి కర్రోళ్ల శివయ్య, నారాయణపేట జిల్లా ధన్వాడ నుంచి కురువ లక్ష్మి, నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి రవి, ఆదిలాబాద్ జిల్లా తాంసీ నుంచి గుర్రి మహేందర్ తదితరులు సీఎంతో మాట్లాడారు. రుణమాఫీ చేసినందుకు సంతోషం వ్యక్తం చేసిన రైతులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

### రూ.లక్ష రుణమాఫీ.. అందోల్ ఫస్ట్..

రూ.లక్ష రుణమాఫీలో రాష్ట్రంలో మొదటి స్థానంలో అందోల్ నియోజకవర్గం నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో హుస్నాబాద్, కల్వకుర్తి రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి. రూ.రెండు లక్షల రుణమాఫీలో భాగంగా మొదటి విడతలో రూ.లక్ష వరకు రుణాలను రాష్ట్ర ప్రభుత్వం గురువారం మాఫీ చేసింది. రాష్ట్రంలోని 110 నియోజకవర్గాల పరిధిలోని (9 నగర నియోజకవర్గాల్లో రైతు రుణాలు లేవు) 10,84,050 రైతు కుటుంబాలకు చెందిన 11,50,193 మంది రైతుల రుణ ఖాతాల్లో రూ.6,098.93 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. దీంతో ఆ కుటుంబాలన్నీ రుణవిముక్తం అయ్యాయి. రుణమాఫీ జరిగిన 110 నియోజకవర్గాల్లో అత్యధికంగా అందోల్ నియోజకవర్గంలో 19,186 రైతు కుటుంబాలకు చెందిన 20,216 మంది రైతులకు చెందిన రూ.107.83 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. తర్వాత హుస్నాబాద్ నియోజకవర్గంలో 18,101 రైతు కుటుంబాలకు చెందిన 18,907 మంది రైతులకు చెందిన రూ.106.74 కోట్లు, కల్వకుర్తి నియోజకవర్గంలో 17,270 రైతు కుటుంబాలకు చెందిన 18,196 మంది రైతులకు చెందిన రూ.103.02 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి.

### రుణమాఫీ నిధులను ఇతర అప్పులకు వాడొద్దు..

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులను రుణమాఫీకే వినియోగించాలని.. ఇతర అప్పులకు ఎట్టి పరిస్థితుల్లోనూ జమ చేయొద్దని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. ఈ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. కేవలం వ్యవసాయ రుణాలను మాఫీచేస్తున్నందున వాటికే జమచేయాలన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రజాభవన్‌లో బ్యాంకర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రైతు రుణమాఫీ దేశంలోనే చరిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. రూ.2లక్షల రుణమాఫీ పథకం ద్వారా ఒకేసారి రూ.31వేల కోట్లు ఏ రాష్ట్రంలోనూ మాఫీ చేయలేదన్నారు. ఆగస్టు నెల దాటకముందే రుణమాఫీ కింద రూ.31వేల కోట్ల నిధులను విడుదల చేస్తాం. గురువారం సాయంత్రం 11 లక్షలకు పైగా రైతులకు రూ.6వేల కోట్లు విడుదల చేస్తున్నాం. ఈ నెలలలోనే రెండో దఫా రూ.లక్షన్నర వరకు బకాయి ఉన్న రైతులకు, ఆ తర్వాత రూ.2లక్షల వరకు రుణాలకు నిధులు విడుదల చేస్తాం అన్నారు. రూ.2 లక్షలకు పైబడి రుణం ఉన్న రైతులతో బ్యాంకర్లు మాట్లాడి మిగిలిన మొత్తాన్ని రికవరీ చేసుకోవాలి. ప్రభుత్వం మంజూరు చేసే రూ.2లక్షలు కలిపి మొత్తంగా ఏ రైతూ రుణ బకాయి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. అధికారంలోకి వచ్చేముందు పీసీసీ అధ్య క్షుడిగా రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేతగా నేను రైతు రుణమాఫీ గ్యారంటీ కార్డుపై సంతకం చేసి ప్రచారంలోకి వెళ్లాం. ఇచ్చిన మాటకు కట్టుబడి తూచా తప్పకుండా రైతు రుణమాఫీని అమలు చేసి చూపిస్తున్నాం అని అన్నారు. రూ.31వేల కోట్ల నిధులను 40లక్షల బ్యాంకు ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది. దేశ బ్యాంకింగ్ రంగంలో ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రికవరీ కావడం ఓ చరిత్ర. కార్పొరేట్ బ్యాంకింగ్‌లోనూ ఇంతలా ఒకేసారి జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం తీసు కున్న ఈ నిర్ణయం.. బ్యాంకింగ్ వ్యవస్థకు పెద్ద ప్రోత్సాహం.

## హరీష్ రావు..
# నీ రాజీనామా ఎక్కడ?

(మొదటి పేజీ తరువాయి..)

హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ప్రతిపక్ష నాయకులుగా ప్రభుత్వం చేసిన మంచి పనిని హర్షం వ్యక్తం చేయాలని తెలిపారు. భారతదేశ చరిత్రలో రైతు రుణమాఫీ సువర్ణ అక్షరాలతో లిఖింప దగ్గ కార్యక్రమం అన్నారు. రైతుబంధుకు, రైతు రుణమాఫీకి సంబంధం లేదన్నారు. రైతుబంధు యధావిధిగా అమలవుతుందన్నారు. రైతు రుణమాఫీని జీర్ణించుకోలేక కేటీఆర్, హరీష్ రావు, బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీకి రేషన్ కార్డుకు సంబంధం లేదన్నారు. పట్టాదారు పాస్ బుక్ కల్గిన ప్రతి రైతుకు ఋణమాఫీ చేసి తీరుతామన్నారు. రైతు, రైతు కూలీ శ్రేయస్సే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని క్లారిటీ ఇచ్చారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు.. సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరిన విషయం తెలిసిందే.. సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించిన హరీశ్‌రావు.. 'సీఎం సవాల్‌ను స్వీకరిస్తున్నానన్నారు. ప్రతిపక్షంగా అధికార పక్షం ఇచ్చిన హామీలను నెరవేర్చడం మా బాధ్యత అని అన్నారు. అసెంబ్లీ ఎదురుగా ఉన్న అమరవీరుల స్థూపం దగ్గరకు వస్తాను.. ఆగస్టు 15లోపు మీరు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని ప్రమాణం చేశారు. ఆగస్టు 15లోపు పూర్తిగా రుణమాఫీ చేయాలి.. రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా? అని.. చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేస్తావా? అని హరీశ్ రావు ప్రశ్నించారు.

## రైతుబంధు నిధుల
# దారి మళ్లింపు

(మొదటి పేజీ తరువాయి..)

కోట్లు రుణమాఫీకి దారి మళ్లించారని ఆరోపించారు. రైతుబంధు డబ్బు నుంచి కొంత మొత్తం విదిల్చి రుణమాఫీ చేస్తున్నట్లు చెబుతున్నారన్నారు. 40 లక్షల మందికి పైగా రైతులు రూ.లక్ష వరకు రుణాలు తీసుకుంటే కేవలం 11 లక్షల మందినే ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. 2014, 2018లో కేసీఆర్ సర్కార్ రుణమాఫీతో పోలిస్తే పావు వంతు రైతులకే అర్హత కల్పించారన్నారు. 2014లోనే కేసీఆర్ సర్కార్ లక్షలోపు రుణాలను మాఫీ చేయడానికి రూ.16,144 కోట్లు వెచ్చించిందని.. సుమారు 35 లక్షల రైతులకు లబ్ది చేకూర్చిందని తెలిపారు. 2018లో అదే లక్షలోపు రుణమాఫీకి రూ.19,198 కోట్లు అంచనా కాగా మొత్తం లబ్దిదారుల సంఖ్య సుమారు 37 లక్షలుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్లు రూ.2 లక్షల వరకు ఉన్న పంటరుణాలు అన్నీ వెంటనే మాఫీ చేయాలన్నారు. అర్హులైన అందరికీ రైతుబంధు విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.




## ప్రాణాలు తీస్తున్న గుంతలపై
# ప్రత్యేక నజర్ పెట్టాలి

- జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్




తొర్రూర్, (నేటి ఫోకస్ న్యూస్)-జూలై 18:

ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతుంటే పోలీస్ శాఖ చూస్తూ ఊరుకోలేదని జిల్లా ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా నేషనల్ హైవే పై, పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రధాన రహదారులపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు వారు ఇచ్చిన ఆదేశాలతో గురువారం తొర్రూర్ పట్టణ సీఐ సంజీవ్, ఎస్సై కూచిపూడి జగదీష్లు నేషనల్ హైవే ఇంజనీర్ కిరణ్ ను వెంటబెట్టుకొని నాంచారి మడూరు నుండి మాటేడు వరకు నేషనల్ హైవే మీద గల రోడ్డు పైన ఉన్న ప్రమాదకర గుంతలను గురువారం గుర్తించామని అన్నారు అనంతరం గుర్తించిన ప్రమాదకర గుంతలను నిర్లక్ష్యం చేయకుండా మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని జిల్లా ఎస్పీ ఇచ్చిన ఆదేశాలను నేషనల్ హైవే వారికి వివరించా వ ం ని తెలిపారు. అంతేకాకుండా పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదారులపై ఉన్న గుంతలను పూడ్చేందుకు స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు సూచించిన ఎస్పీ సూచనల మేరకు స్వచ్ఛందంగా ప్రధాన రహదారులపై ఉన్న గుంతలను పూడ్చి యాక్సిడెంట్ల నివారణ చర్యలు చేపడతామని సిఐ సంజీవ్ ఎస్సై జగదీష్ అన్నారు.



# రైతుల ఖాతాల్లోకి రుణమాఫీ సొమ్ము

### - రైతు రుణమాఫీ-2024, నిధుల విడుదల కార్యక్రమం

మహబూబాబాద్, (నేటి ఫోకస్న్యూస్)-జూలై 18:

జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం రైతు రుణమాఫీ - 2024, నిధుల విడుదల కార్యక్రమం సందర్భంగా అన్ని జిల్లాల రైతు వేదికల్లో ఎంపీలు, ఎంఎల్ఏలు, ఎంఎల్సీలు, కలెక్టర్లు, రైతులతో వర్చువల్ విధానం (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా) ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మాట్లాడి, రైతు రుణ మాఫీ పథకాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో మొదటి విడత కింద రూ. లక్ష లోపు రుణ మాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లోకి జమ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా (577) రైతు వేదికల్లో ఈ రైతు రుణ మాఫీ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మాట నిలబెట్టుకున్నామని అన్నారు. ప్రభుత్వం మాట ఇస్తే శిలాశాసనం అని వ్యాఖ్యానించారు. నా జీవితంలో ఈ రోజు ఎప్పటికీ గుర్తుండిపోయే మరపురాని రోజు అని తెలిపారు.








## ప్రతి ఎకరాకు సాగునీరందించడమే
# ప్రభుత్వ లక్ష్యం

- రెండు రోజుల్లో గుడిపల్లి రిజర్వాయర్ నుంచి సాగునీటి విడుదల
- గుడిపల్లి రిజర్వాయర్ను సందర్శించిన ఎమ్మెల్యే మేగా రెడ్డి

వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:

ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేగారెడ్డి అన్నారు. గురువారం రైతు రుణమాఫీ సంబరాలలో భాగంగా రేవల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు ఎడ్లబండ్లను అలంకరించి డప్పు చప్పుళ్లతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గుడిపల్లి రిజర్వాయర్ ను సందర్శించి ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాం ల నుంచి వరద ప్రవాహం మొదలై జూరాల నిండుతోందని రెండు రోజుల్లో జూరాల గేట్లు ఎత్తి శ్రీశైలం ప్రాజెక్టుకు నీటిని వదిలే అవకాశం ఉండడంతో గుడిపల్లి రిజర్వాయర్ నుంచి సాగునీటిని వదిలేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. సాగునీటిపరంగా అన్నదాతలు ఎవరు అధైర్య పడొద్దు అని అవసరం అయితే సొంత నిధులతో కెనాల్ కు మరమ్మతులు చేయించి సాగునీటిని అందిస్తానని హామీ ఇచ్చారు. గుడిపల్లి రిజర్వాయర్ వద్ద ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్వతాలు మాజీ ఎంపీపీ సత్యశీలా రెడ్డి, జయపాల్ రెడ్డి, అచ్యుత రామారావు తదితరులు పాల్గొన్నారు.







## పరిసరాలను పరిశుభ్రంగా
# ఉంచుకుందాం

- దోమల నుండి ప్రాణాలను కాపాడుకుందాం
- జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు ఓల్డ్ బోయిన్పల్లిలో దోమలపై అవగాహన సదస్సు



ఫోకస్ న్యూస్, ఓల్డ్ బోయిన్ పల్లి కంటోన్మెంట్ జూలై 18:

ఇంటి చుట్టుపక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే దోమల వలన అనేక రోగాలకు గురి కావాల్సి వస్తుందని, కూకట్ పల్లి జోనల్ శానిటేషన్ సూపర్వైజర్ మనోహర్ రెడ్డి తెలిపారు. గురువారం ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లో జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు దోమలపై అవగాహన కార్యక్రమాన్ని, జిహెచ్ఎంసి అధికారులు సిబ్బంది, ప్రముఖ డాన్స్ మాస్టర్ డి ప్రోగ్రాం జడ్జి ద్వారా దోమల వలన జరిగే నష్టాన్ని విరుత్నంగా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు దోమలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీగా వెళ్లి ప్రతిబస్తీ కాలనీలలో తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వర్షం నీటిలో ఏడీస్ దోమ నీటి నిలువ ప్రదేశాల్లో వాలి గుడ్డు పెట్టి తోక పురుగుగా మారి లార్వగా దోమగా వృద్ధి చెంది ఆ దోమ కాటు అనేకమంది డెంగ్యూ వ్యాధికి గురవుతున్నారని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ మహిపాల్ సూచనలతో ఏంటోమాలజీ సూపర్వైజర్ స్వామి ఆధ్వర్యంలో హైటెక్ మోడల్ స్కూల్ లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ తగు జాగరులు తీసుకోవాలని సూచించారు. దోమలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినందుకు మోడల్ స్కూల్ యజమాన్యం జిహెచ్ఎంసి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జవాన్ బుజ్జి, శానిటేషన్ ఇన్చార్జి చైతన్య ప్రకాష్, ఎస్ ఎఫ్ ఏ సంపత్, రాంకీ సూపర్వైజర్ అరుణ, ఈశ్వరమ్మ దుర్గా శాంతి సౌజన్య సుప్రియ అరుణ దేవితో పాటు కాలనీవాసులు తదితరులు అధిక సంఖ్యలు పాల్గొన్నారు.

## 23నుంచి శాసనసభ సమావేశాలు

### - జులై 25 లేదా 26వ తేదీల్లో బడ్జెట్

హైదరాబాద్, (నేటి ఫోకస్న్యూస్), జూలై 18:

శాసనసభ, మండలి సమావేశాలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 23 నుంచి శాసనసభ, 24 నుంచి శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. శాసనసభ సమావేశాల నేపథ్యంలో జులై 25 లేదా 26వ తేదీల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ను ప్రవేశపెట్టనుంది. పది రోజుల పాటు అసెంబ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పది రోజుల్లో రైతు భరోసా, కొత్త ఆర్ఓఆర్ చట్టం, తెలంగాణ లోగో మార్పు, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుతో పాటు పలు బిల్లులపై అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆయా శాఖల అధికారులతో వరుసగా చర్చలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఏయే శాఖలకు కేటాయింపులు ఎలా జరపాలనే అంశంపై అధికారులు సుదీర్ఘ కసరత్తు చేస్తున్నారు. దీనికితోడు కేంద్ర బడ్జెట్ తరవతనే బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. కేంద్రం కేటాయింపులను సరిచూసి బడ్జెట్ పెట్టే యోచనలో ఉన్నారు.

## రుణమాఫీ సాహసోపేతమైన నిర్ణయం

### - మాజీమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడి

నిర్మల్, (నేటి ఫోకస్న్యూస్), జూలై 18:

రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని మాజీమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా ఋణమాఫీ నిర్ణయం తీసుకోవడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షలు రైతు రుణమాఫీ అమలు చేస్తోందన్నారు. రైతు ఋణమాఫీ గురించి గతంలో చాలా ఆందోళనలు జరిగినా.. ఎవ్వరూ ఇంత ధైర్యం చేయలేదని ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. మొదటి దఫా 11లక్షల 50 వేల మంది రైతులకు లక్ష లోపు రూ. 7వేల కోట్లు సాయంత్రం నాలుగు గంటలకు జమ అవుతుందని ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. మూడు దఫాలుగా 39 లక్షల మంది రైతులకు 31 వేల కోట్లు రైతుల అకౌంట్లో ప్రభుత్వం వేస్తుందని అన్నారు. రేషన్ కార్డు కుటుంబ వివరాల కోసమేనని తెలిపారు. పాస్ బుక్ ద్వారా రైతులందరికీ ఋణమాఫీ జరుగుతుందని పేర్కొన్నారు. చిన్న చిన్న సమస్యలు సాధారణంగా వస్తాయని.. సమస్యలను స్థానిక అధికారులు పరిష్కరిస్తారని ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. 40 ఏళ్లలో ఇంత గొప్ప కార్యక్రమం జరగలేదని ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. రైతులకు రెండు లక్షల ఋణమాఫీ చేయడం రైతు బిడ్డగా గర్వంగా ఫీలవుతున్నానని ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు.

## చేపలవేటకు వెళ్లిన వారిపై పిడుగు

### - ఇద్దరు యువకుల మృతి

భద్రాద్రి కొత్తగూడెం, (నేటి ఫోకస్న్యూస్), జూలై 18:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. చేపల వేటకు వెళ్లిన ఇద్దరు యువకులపై పిడుగు పడడంతో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు దమ్మపేట మండలం జమేదార్ బంజర్ గ్రామ చెరువులో చేపలు పడుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాలో విస్తారంగా కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షం కురిసింది. భద్రాచలంలోని చర్ల వద్ద రహదారి పైకి నీరు చేరడంతో రాకపోలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల ఈదురు గాలుల కు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరా స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారిపై పైకి 3అడుగుల మేర వర్షం నీరు చేరడటంతో చర్ల, దుమ్ముగూడెం మండలాల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలు కురువనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఫోకస్ న్యూస్
శుక్రవారం 19, జూలై 2024

# బన్నీతో సుకుమార్ గొడవ?

## మూవీ షూటింగ్ డిలేపై సర్వత్రా అనుమానాలు...

ప్రస్తుతం టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రాలలో పుష్ప ఒకటి. బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప: ది రైజ్' కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమా భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతుంది. టాలీ వుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథా నాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటిస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి గత రెండు రోజులుగా ఒక వార్త సోషల్ మీడియా లో ఫుల్ వైరల్ అవుతుంది. దర్శకుడు సుకుమార్, అల్లు అర్జున్‌ల మధ్య ఉన్న రిలేషన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సి న పని లేదు.ఆర్య సినిమాతో మొదలైన ఈ జర్నీ ఇప్పటివరకు కొనసాగుతుం ది. అయితే తాజాగా వీరిద్దరి మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తుంది. పుష్ప 2 షూటింగ్ చివరి దశలో ఉన్న క్రమంలో వీరిద్దరి మధ్య గొడవ జరిగినట్లు.. దీంతో అల్లు అర్జున్ సుకుమార్ మీద ఉన్న కోపంతో తన గడ్డం తీసేసి ట్రిప్‌కు చెక్కేసారని సోషల్ మీడియా లో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే గడ్డం పెరిగే బన్నీ షూటింగ్‌కు వచ్చేలోపు సుకుమార్ ట్రిప్‌కు వెళ్లబో తున్నాడని తెలుస్తుంది. దీంతో ఈ విషయం నిజామా కాదా అనేది తెలియాలంటే చిత్రబృందం ప్రకటించే వరకు ఆగాల్సిందే. మరోవైపు వీరి గొడవ వలన ఈ షూటింగ్ వాయిదా పడిందని ఇప్పటికే ఆగష్టు నుంచి డిసెంబర్‌కు వాయిదా పడిన ఈ చిత్రం డిసెంబర్‌లో అయిన విడు దల అవుతుందా లేదా 2025 లోకి వెళుతుందా అనేది తెలియాల్సి ఉంది. మరోవైపు ఈ మూవీ షూటింగ్ జూలై ఎండింగ్ నాటికి ముగించాలని అల్లు అర్జున్ ఆర్డర్ వేసినట్లు సమాచారం. అయితే షూటింగ్ పూర్తి కావడానికి నెల సమయం పడుతుందని. ఇప్పటికే కొన్ని ఎపిసోడ్‌లను సుకు మార్ రీడిజైన్ చేసిన ట్లు తెలుస్తుంది. దీంతో షూటింగ్ ఎఫెక్ట్ పడినట్లు సమాచారం. మరోవైపు వీఎఫ్ఎక్స్ వర్క్ విషయంలో సుకుమార్ కన్విన్స్ కాకపోవడంతో అవి పూర్తి కావ డానికి ఎక్కువ సమయం పడుతుందని తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# తేజస్ కంచర్ల విభిన్న చిత్రం

## 'ఉరుకు పటేల' టైటిల్ రోల్..

హుషారు' వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన నటుడు తేజస్ కంచర్ల ఇప్పుడు మరింతగా ప్రేక్షకులకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం తేజస్ చేస్తున్న 'ఉరుకు పటేల' చిత్రం.. ప్రేక్షకులకు ఆయనని మరింత దగ్గర చేస్తుందని ఎంతో నమ్ముతున్నారు. తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'గెట్ ఉరిక్గి÷డ్' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. ఈ ఫస్ట్ లుక్‌తో పాటు చిత్ర వివరాలను తాజాగా మేకర్స్ తెలియజేశారు. ముందుగా ఈ పోస్టర్‌ను గమనిస్తే.. తేజస్ కంచర్ల పరిగెడుతుంటే అతని వెనుక కత్తిని ఎవరో విసిరేసినట్లు కనిపిస్తుంది. మరో వైపు మంగళసూత్రం, పోస్టల్ బ్యాలెట్ పేపర్, పాల క్యాన్ అన్నీ కనిపిస్తున్నాయి. ఇది గ్రామీణ నేపథ్యంలో భావోద్వేగాల ప్రధానంగా సాగే చిత్రమని ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే తెలుస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని కలిగించేలా ఉంది. ఈ సినిమాలో ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలు ఉంటాయనే దానికి సింబాలిక్‌గా పోస్టర్‌ని డిజైన్ చేశారు. అలాగే ఈ టైటిల్‌కు మాదిరిగానే.. సినిమా కూడా ఉరుకే ఉరుకు అన్నట్లుగా ఉంటుందనేలా ఈ ఫస్ట్ లుక్ క్లారిటీ ఇచ్చేస్తోంది.



# ఫిల్మ్‌సిటీలో శరవేగంగా తండేల్ చిత్రీకరణ

నాగచైతన్య, లేడీ పవర్‌స్టార్ సాయి పల్లవి రెండోసారి తెరపై సందడి చేయడానికి సిద్ధమయ్యారు. వీరిద్దరూ జంటగా 'తండేల్' సినిమా తెరకెక్కుతోంది. చందు మొండేటి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. ప్రధాన పాత్రధారులపై కీలకమైన టాకీ పార్టును తెరకెక్కిస్తున్నారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో నాగచైతన్య, సాయిపల్లవి డీగ్లామర్ పాత్రల్లో నటిస్తున్నారు. పాత్రలు వేషం, సంభాషణలు అత్యంత సహజంగా ఉంటాయని, భారీ హంగులతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి పంచుతుందని సినీ వర్గాలు తెలిపాయి. 'విరాటపర్వం', 'గార్గి' చిత్రాల్లో నటనకుగానూ ఉత్తమ నటిగా రెండు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాల్ని సొంతం చేసుకున్నారు సాయిపల్లవి. ఈ సందర్భంగా ఆమెని 'తండేల్' సినిమా సెట్లో ఆ చిత్రబృందం సత్కరించింది.





# సైమా అవార్డులు..

## జైలర్‌తో X దసరా..

సౌత్ ఇండియా ఇంటర్నేషనల్ మూవీ అవార్డు సైమా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సెప్టెంబరు 14, 15వ తేదీల్లో దుబాయ్ వేదికగా జరుగనుంది. ఇప్పటికే ఈ అవార్డుల కోసం పోటీ పగుతున్న చిత్రాలు, నటీనటులు, టెక్నీషియన్ల జాబితా తాజాగా వెల్లడైంది. అయితే ఇందులో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్' ఏకంగా 12 విభాగాల్లో, తెలుగులో నాని నటిం చిన దసరా 11 విభాగాల్లో, హాయ్ నాన్న 10 విభాగాల్లో, మలయాళం లో టోవినో థామస్ నటించిన 2018, కన్నడలో దర్శణ్ నటిం చిన కాటేరా 8 విభాగాల్లో సైమా అవార్డుల కోసం పోటీ పడుతుండడం విశేషం. తెలుగులో ఉత్తమ చిత్రం జాబితాలో దసరా, బలగం, బేబీ, భగవంత్ సింగ్ కేసరి, హాయ్ నాన్న , విరూపాక్ష చిత్రాలు ఉండగా. ఉత్తమ నటులు జాబితాలో చిరంజీవి, బాలకృష్ణ, నాని, ధనుష్, సాయి ధరమ్ తేజ్ పోటీ పడుతున్నారు. ఉత్తమ కథానాయికల జాబితాలో శ్రీలీల, సంయుక్త, పాయల్ రాజ్ పుత్, కీర్తి సురేశ్, శృతి హాసన్, మృణాల్ ఠాకూర్ ఉన్నారు. ఉత్తమ దర్శకులుగా అనీల్ రావిపూడి, గోపీచంద్, సాయి రాజేశ్, బాబీ, కార్తీక్ దండు ఉన్నారు. ఉత్తమ సోర్టింగ్ యాక్టర్స్‌గా బ్రహ్మానందం, రవికృష్ణ, అంగద్ బేడీ, విరాజ్ అశ్విన్, ఫృధ్వీరాజ్ సుకుమారన్, దీక్షిత్ శెట్టి ఉన్నారు. తమిళంలో ఉత్తమ చిత్రం జాబితాలో నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన 'జైలర్', మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఉదయనిధి, వడివేలు నటించిన 'మామన్నన్', లోకేశ్ కనగరాజ్ లియో, మణిరత్నం పొన్నియిన్ సెల్వన్-2, వెట్రిమారన్ దర్శకత్వం వహించిన విడుదలై వంటి చిత్రాలు న్నాయి. అదేవిధంగా తమిళంలో ఉత్తమ నటుల విభాగంలో రజనీకాంత్, విజయ్, విక్రమ్, శివకార్తికేయన్ (మావీరన్), ఉదయనిధి ఉన్నారు. ఉత్తమ నటి విభాగంలో త్రిష, నయనతార, ఐశ్వర్యా రాయ్, కీర్తి సురేష్, మీతా రఘునాథ్. ఐశ్వర్య రాజేష్ ఉన్నారు. ఉత్తమ దర్శకుల కేటగిరీలో నెల్సన్, లోకేష్ కనకరాజ్, మణిరత్నం, వెట్రిమారన్, అరుణ్ కుమార్, మారి సెల్వ రాజ్ ఉన్నారు.



